
# వేగం




గాలి వేగం స్పర్శకి తెలుస్తుంది.

వరద వేగం.... జలపాతం వేగం కంటికి కనిపిస్తాయి.

కానీ రోజురోజుకీ మారుతున్న జీవనవేగం నిలిచి ఆలోచిస్తేనే కానీ దృష్టికి రాదు.

★ ★ ★

అంతకు ముందు ఆ వీధిలో చాలాసార్లు చాలామంది చూశారు ఆ మనిషిని..... కానీ ఎవరికీ తెలియదు తనెవరో.

గాలిని చీలుస్తున్నట్టు, ప్రపంచంలో అందరికన్నా తనకే తొందర పని ఉన్నట్టు గబగబా నడుస్తూంటుంది.

చేతిలో వో చిన్న బట్టలమూట.... ఎటువేపో చూసే తేనెరంగు కళ్ళు.... కొట్టొచ్చినట్టు కనపడే నవ్వు.... గబగబా నడిచే నడక.... అసలు పేరు ఏమిటో ఎవరికీ తెలియదు కానీ... అందరూ పిలిచే ఆ పాతికేళ్ళ ఆకారం పేరు పిచ్చిది.

ఒకోసారి వొంటినిండా బట్టుండేది.....

వొక్కోసారి సగమే వుండేది.... అలాంటప్పుడు చేతిలో బట్టల మూటని ఎడం రొమ్ముకేసి నొక్కుకుని.... రెండో రొమ్ముని గాలి కొదిలేసి.... ఏమీ తెలియని చిన్నపిల్లలా అలాగే నవ్వుతూ నడుస్తుండేది.

తన తొందర నడకలో పిచ్చిగా ఎగిరిపడే బరువైన పాతికేళ్ళ యవ్వనాన్ని నగ్నంగా చాలా కళ్ళు చూసేవి.

ఆశగా, ఆబగా చూసే చాలా మంది చూపుల్తో తనకి సంబంధం లేదన్నట్టు, అలాగే పసిపిల్లలా తన పిచ్చి నవ్వు తను నవ్వుకుంటూనే వుండేది.

గబగబా నడుస్తున్నదల్లా ఆగిపోయేది. గబుక్కుని ఎవరి దగ్గరకో వెళ్ళి.... "పైసాదేవ్" అనేది వాళ్ళు విన్నా వినకపోయినా, ఒకటి రెండుసార్లు అలాగే.... "పైసాదేవ్" అనేది. మొండిగా వుండేది ఆ గొంతు. మామూలుగా అడుక్కునే వాళ్ల వినయాలుండేవి కావు ఆ అడగటంలో.

ఆకలికి ఏం దొరికితే అది తినేది... పగలంతా అలాగే తిరిగేది. తనలో తను గొణుక్కునేది... ఒక్కోసారి రాత్రుళ్ళు ఏ అరుగుమీదో కూచుని వో మాటకి మరో మాటకి సంబంధం లేని అరుపులేవో అరిచేది.

వరుసగా కొన్ని రాత్రుళ్ళు ఓ అరుగు మీద పడుకుంటే, మరికొన్నాళ్ళు మరో అరుగు మీద...

ఎప్పుడో ఆ వీధిలో వుండే వో బ్రాందీ షాప్ వోనర్ యింట్లో పనిచేసేదని, అతను మరో వూరు వెళ్ళిపోయాడని.... ఆ తర్వాత యిలా పిచ్చిదయిందని.... తన గురించి కొందరంటుండేవారు... కానీ సరైన వివరాలుఎవరికీ తెలియవు.

ఆ వీధిలో వుండే కుక్కల్ని చూసినట్టు, చెత్త కుండీల్ని చూసినట్టు ఆ పిచ్చిదాన్ని చూట్టం అందరికీ అలవాటైపోయింది.

★ ★ ★

ఏ చీకటి అరుగు మీద ఎవరు కక్కుర్తి పడ్డారో.... ఆ సమయంలో ఆ పిచ్చివాళ్ల యిష్టపడిందో లేదో కానీ పిచ్చిదానికి కడుపొచ్చింది.

ఎదిగే ఆ కడుపు.... తొమ్మిది నెలలు ఆ పిచ్చిదాని మోత.... అందరి కళ్ళల్లో పడింది.

ఎవడో దరిద్రుడు...

ఎంత కక్కుర్తో...

యిలా రకరకాలుగా అనుకున్నారు. అనుకున్న వాళ్లలో, చాలాసార్లు ఆ పిచ్చి దానివేపు ఆశగా, ఆబగా చూసినవాళ్ళూ వున్నారు.

అంతకన్నా ఎక్కువగా ఆలోచించే అవసరం, అవకాశం ఎవరికీ కలగలేదు.

కడుపు పెరుగుతున్నా పిచ్చిదాన్లో మార్పేం రాలేదు.... నడక తొందర కొంచెం తగ్గింది తప్ప.

★ ★ ★

కొద్దిగా చినుకులు పడి వెలిశాయి.

నెమ్మదిగా ఒక్కొక్కళ్ళే చుట్టూ చేరటం మొదలెట్టారు. పోస్టాఫీసు ముందున్న పెద్ద పోస్ట్‌బాక్స్‌ని ఆనుకుని కూచునుంది.... చిన్న చిన్న అరుపులు, మూలుగులవల్ల ఆ మనిషి అక్కడున్నట్టు తెలుస్తోంది.

పోస్టాఫీసు పక్కనున్న యిరానీ హోటలులో పనిచేసేవాళ్ళు యిద్దరు బైటికొచ్చి గుంపులో చేరి చూశారు.

"పిచ్చిది రోడ్డుమీద కనేసేలా వుందిరోయి...." అందో గొంతు. ఆ మాటతో హోటలు ముందున్న జనం మరికొంత మంది గుంపులో చేరారు.

కొత్తగా వచ్చిన వాళ్ళు "ఏమిటేమిటి..." అన్నారు.

ఆ పిచ్చి బలం కూడా తట్టుకోలేని బాధ. పురిటి నొప్పులబాధ భరించలేక ఇంకొంచెం గట్టిగా అరవటం మొదలెట్టింది. కాళ్ళు పూర్తిగా జాపేసి పోస్ట్ బాక్స్ మీదకి వోరగా వొదిగి పడుకుంది.

అందరూ అలా చూస్తూనే వున్నారు.

మరో పావుగంట మరణబాధ పడి.... పబ్లిక్ రోడ్డు మీద... అందరి సమక్షంలో తడితడిగా, చీదరగా వున్న ఆ నేలమీద.... అలాగే పిచ్చిది వో పిల్లాణ్ణి కనేసింది... కనేసి సొమ్మసిల్లి పడిపోయింది....

అడుక్కునేదో, పనిపాటలు చేసుకునేదో వో మాసికల చీర ఆడకూతురు దగ్గరగా వెళ్ళింది. హోటల్లోంచి ఎవరో వో బ్లేడు తెచ్చారు...

మరి కాస్సేపటికి పిల్లాడి ఏడుపు రోడ్డంతా వినపడింది.

ఏడుపు వినలేక కాబోలు, అంతవరకు అందరితోపాటు చోద్యం చూసిన మబ్బులు కూడా ఏడుపు మొదలెట్టాయి.

వర్షానికి తడుస్తామనో, చూడాల్సిందంతా చూసేశామనో వొక్కొక్కరే వెళ్ళిపోటం మొదలెట్టారు.

కాస్సేపటికి తెలివొచ్చిన పిచ్చిది, పిల్లాడితో నెమ్మదిగా పోస్టాఫీసు అరుగుమీదకి చేరింది.

అక్కడ ఆ రోడ్డుమీద పురిటి గుర్తుంటే మరీ అసభ్యంగా వుంటుందని కాబోలు హోరుమని కురుస్తున్న వర్షం శుభ్రం చెయ్యటం మొదలెట్టింది.

కొంతమంది 'అయ్యోపాపం' అనుకున్నారు. మరికొంత మంది పిచ్చిదాని పరిస్థితికి ఓ క్షణం బాధపడ్డారు.

గుంపులో ఏ ఒక్కరూ మిగలకుండా అంతా వెళ్ళిపోయారు. రోడ్డుమీద చూసే అనేక యాక్సిడెంట్సుని చూసినట్టే అదీ చూశారు.

ఎవర్నీ ఎవరూ తప్పు పట్టలేని వేగం... చాలా అమానుషాలు, దారుణాలు అతి సాధారణమై పోయిన వేగం....

• *ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, 14-5-1976*

• *కస్తూరి, డిసెంబర్ - 1976 (కన్నడం)*